సాక్షి
నారాయణపేట

బుధవారం । 28 । జూన్ । 2023



తీరనున్న వంతెన కష్టాలు

కల్వకుర్తి మండలం రఘుపతిపేట వద్ద బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి.

వివరాలు 8లో ▸



'సురవరం' సేవలు ఎనలేనివి

సాహిత్యానికి సురవరం ప్రతాపరెడ్డి ఎనలేని సేవలు చేశారని లక్ష్మీకాంత్‌రాథోడ్ అన్నారు.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
32.3 /24.2

వాతావరణం

ఉదయం నుంచి ఎండగా ఉంటుంది. మధ్యాహ్నం ఆకాశం మేఘావృతమై చల్లని గాలులు వీస్తాయి. జల్లులు కురియవచ్చు.

న్యూస్‌రీల్

సివిల్స్ కోచింగ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

నారాయణపేట రూరల్: షెడ్యూల్డ్ కులాల శాఖ రాష్ట్ర స్టడీ సెంటర్‌లో సివిల్స్ ప్రిలిమినరీ, మేయిన్స్ 10నెలల కోచింగ్ కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సంబంధిత అధికారి కన్యాకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 9న హైదరాబాద్, నిజామాబాద్, వరంగల్‌లో రాత పరీక్ష ఉంటుందని, 140 ప్రశ్నలకుగాను 100 జనరల్ స్టడీస్, 40 సీ–శాట్ ప్రశ్నలు ఉంటాయని మూడు గంటల్లో పూర్తి చేయాలని తెలిపారు. 75 సీట్లు షెడ్యూల్డ్ కులాలు, 15 సీట్లు వెనకబడిన తరగతుల వారికి, 10సీట్లు షెడ్యూల్డ్ తెగల వారికి కేటాయించారని, వీటిలో 33శాతం మహిళలు, 5శాతం వికలాంగులు ఉంటారని, ఆసక్తి ఉన్నవారు జూలై 2వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

నారాయణపేట రూరల్: జిల్లా ప్రజలకు ఆర్టీసీ అందిస్తున్న రవాణా సేవలకు సంబంధించి సమస్యలు ఉంటే తెలుసుకునేందుకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఎం ఆంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు సెల్ నంబర్ 73828 26293 కు కాల్ చేసి ప్రయాణికులు తమ ఫిర్యాదులు, సలహాలను తెలియజేయాలని పేర్కొన్నారు.

బక్రీద్ పోస్టర్ ఆవిష్కరించిన ఏఎస్పీ

నారాయణపేట రూరల్ : బక్రీద్ పండుగకు సంబంధించి ముస్లింలు రూపొందించిన పోస్టర్‌ను అడిషనల్ ఎస్పీ నాగేంద్రుడు మంగళవారం రాత్రి ఆవిష్కరించారు. శాంతియుతంగా పండుగ జరుపుకోవాలని సూచించారు. అక్రమంగా గోవులను తరలించరాదని, వధించడం నేరమని అన్నారు. జంతు కళేబరాలను ఎక్కడపడితే అక్కడ పారవేయరాదని, ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో నవాజ్‌మూసా, అమిరోద్దీన్, తఖీ చాంద్, సలాం అహ్మద్ పాల్గొన్నారు.

శాంతియుతంగా జరుపుకోవాలి



జిల్లాకేంద్రంలోని ముస్లిం మతపెద్దలతో పోలీసుస్టేషన్‌లో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రవిబాబు, ఎస్‌ఐ సురేష్ మాట్లాడుతూ..బక్రీద్ వేడుకలను భక్తిశ్రద్ధలతో శాంతియుతంగా నిర్వహించుకోవాలని సూచించారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని, ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగకుండా చూసుకోవాలని కోరారు. జంతు కళేబరాలను ఎక్కడపడితే అక్కడ పారవేయరాదని, ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని సూచించారు. అనంతరం ఈద్గా, బువ్వమ్మ దర్గాలను పరిశీలించారు.

ఘనంగా మైసమ్మవ్వ గంపజాతర

మాగనూర్: మండల కేంద్రంలోని వ్యవసాయ పొలాల దగ్గర వెలసిన మైసమ్మవ్వ గంపజాతర మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బోనం, గంప తలపై పెట్టుకొని ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకొని నైవేద్యాన్ని సమర్పించారు. సకాలంలో వర్షాలు సమృద్ధిగా పడాలని, పశుసంపద వర్ధిల్లాలని అమ్మవారిని వేడుకున్నారు. ప్రతి సంవత్సరం వర్షాకాలం ప్రారంభం అయిన సందర్భంగా ఇక్కడ గంప జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని గ్రామపెద్దలు తెలిపారు. పూలమాల తోరణాలతో అందంగా అమ్మవారి ఆలయాన్ని అలంకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజు, ఉపసర్పంచ్ సుధా, ఎంపీపీ శ్యామలమ్మ, యువకులు పాల్గొన్నారు.

పోలేరమ్మకు బోనాల నైవేద్యం



నర్వ: మండలంలోని యాంకి, రాయికోడ్, లంకాల్ గ్రామాల్లో మంగళవారం పోలేరమ్మ జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యాంకి చెరువుకట్టపై వెలిసిన పోలేరమ్మ ఆలయానికి బోనాలతో ఊరేగింపుగా వచ్చారు. అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి నైవేద్యాన్ని సమర్పించారు. ఆయా గ్రామాల్లో పండుగ సందడి కనిపించింది. ఆలయాన్ని మామిడి తోరణాలతో అలంకరించారు.

ఆదిలోనే అడ్డంకులు!



పెద్దకడ్మూర్ ఉన్నత పాఠశాలలో డిజిటల్ స్మార్ట్‌బోర్డు

- స్మార్ట్ టీవీలతో సరిపెట్టిన అధికారులు
- జిల్లాలోని 49 పాఠశాలల్లో డిజిటల్ బోర్డులు ఏర్పాటు
- విద్యుత్, ఇంటర్‌నెట్ కనెక్షన్ లేక నిలిచిన బోధన

నర్వ: సర్కారు పాఠశాలల్లో స్మార్ట్‌బోధనకు ప్రభుత్వం శ్రీకారం చుట్టినా.. విద్యుత్, ఇంటర్‌నెట్ కనెక్షన్ లేకపోవడంతో బోధన సాగడంలేదు. నెలరోజుల క్రితం పాఠశాలల్లో గ్రీన్‌చాక్ ప్యానెల్ బోర్డులను ఎంపిక చేయగా, వారంక్రితం స్మార్ట్ టీవీలను ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేదు. ఇంటర్నెట్ కోసం బ్రాడ్‌బాండ్ కనెక్షన్ లేదు. ఎలా బోధించాలనే అంశంపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వలేదు. దీంతో జిల్లాలో స్మార్ట్ బోధన మరింత ఆలస్యమయ్యేలా కనిపిస్తోంది.

జిల్లా వ్యాప్తంగా 500లకు పైగా ప్రభుత్వ పాఠశాలలున్నాయి. ఒకటి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. 8, 9, 10 తరగతుల వారికి బ్లాక్‌బోర్డుపై చిత్రాలు గీయడం, ప్రయోగ పరికరాలతో బోధన చేయాల్సి ఉంటుంది.

జిల్లాలో ఇలా..

మన ఊరు-మన బడికి ఎంపికైన పాఠశాలలు	అనుమతి మంజూరైనవి
174	173
మొదటి విడతలో స్మార్ట్‌బోర్డులు మంజూరు	**ఇన్‌స్టలేషన్ పూర్తి చేసిన పాఠశాలలు**
49	147

విద్యాశాఖ గుర్తించి మన ఊరు -మన బడి కార్యక్రమం ద్వారా ఎంపిక చేసిన బడుల్లో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేసిన ఇన్‌ట్రాక్టివ్ ఫ్లోటింగ్ ప్యానెల్ (స్మార్ట్‌బోర్డు) బోర్డులను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. జిల్లాలోని 174 పాఠశాలల్లో మన ఊరు -మన బడి కార్యక్రమం కోసం ఎంపికవగా మొదటి విడతగా స్మార్ట్‌బోర్డుల ఏర్పాటుకు 49 బడులను ఎంపిక చేస్తూ.. గత విద్యా సంవత్సరం చివరలో ఉత్తర్వులు వచ్చాయి.

తెరిస్తే తెర.. మూస్తే చాక్‌బోర్డు...

పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఇన్‌ట్రాక్టివ్ ప్యానెల్ బోర్డులు ఆకట్టుకున్నాయి. ఒక ఫ్రేమ్ ఏర్పాటు చేసి అందులో 75 అంగుళాల స్మార్ట్‌టీవీని అమర్చారు. ఇరువైపులా గ్రీన్‌చాక్ బోర్డు ఏర్పాటు చేశారు. డిజిటల్ పాఠం అవసరమైనప్పుడు దాని ద్వారా చూపించవచ్చు. అవసరమైతే స్మార్ట్ ఫోన్ మాదిరిగా చేతితో టచ్ చేయవచ్చు. అవసరమైన రంగుల్లో చేతితో రాయవచ్చు. లేదంటే మూసి ఉంచి చాక్‌పీస్‌తో పాఠాలు బోధించవచ్చు. ఆటోమేటిక్ అప్‌డేట్‌తో పాటు యాంటీ వైరస్ ఉంటుంది. ఉపాధ్యాయుడు చెప్పిన పాఠాన్ని రికార్డు చేసి నాలుగు రోజుల తర్వాత వినే సదుపాయం ఉంటుంది. పాఠ్యపుస్తకాల్లో ఉండే పాఠ్యాంశాలను ఆన్‌లైన్ ద్వారా చూపించవచ్చు. ఇలాంటి ఆధునిక సదుపాయాలు ఉన్న స్మార్ట్‌బోర్డులను వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని విద్యార్థులు కోరుతున్నారు.

టీజీ నెట్ కనెక్షన్ అందిస్తాం..



జిల్లాలోని 49 పాఠశాలల్లో 147 స్మార్ట్‌బోర్డుల ఏర్పాటు ప్రక్రియ పూర్తయ్యింది. ఇతర ఇన్‌స్టలేషన్ ప్రక్రియను ఆయా పాఠశాలల్లో పూర్తి చేశాం. వీటిని వినియోగంలోకి తీసుకురావడానికి ఇంటర్‌నెట్ కనెక్షన్ అందించేందుకు చర్యలు తీసుకుంటాం. పాఠాలు అవసరమైనప్పుడు విద్యార్థులకు ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులు తాత్కాలికంగా వారి మొబైల్ ఫోన్‌లతో బోధిస్తున్నారు. గ్రామాల్లోని పంచాయతీలు, పీహెచ్‌సీలకు అందించే టీజీ నెట్‌వర్క్‌ను అందించేందుకు ఉన్నతాధికారులకు విన్నవించాం.

– శ్రీనివాసులు, మానిటరింగ్ అధికారి

నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలి



తిప్పరాస్‌పల్లిలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ శ్రీహర్ష, అడిషనల్ కలెక్టర్

ఊట్కూరు: హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ కోయశ్రీహర్ష అన్నారు. మంగళవారం ఊట్కూరు మండలంలో అడిషనల్ కలెక్టర్ మయాంక్‌మిట్టల్‌తో కలిసి పనులను పరిశీలించారు. తిప్పరాస్‌పల్లి, బాపూర్, ఊట్కూరు, మల్లెపల్లి తదితర గ్రామాలలో మక్తల్, నారాయణపేట రహదారి పక్కన మొక్కలు నాటే పనులను పరిశీలించారు. బీటీ రోడ్డుకు దూరంగా మొక్కలను నాటి ట్రీగార్డ్‌లు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. మొక్కలకు ట్యాంకర్‌ల ద్వారా నీళ్లు పోసి సంరక్షించాలని అధికారులకు సూచించారు. గ్రామాలలో పూర్తిస్థాయిలో మొక్కలు నాటాలని చెప్పారు. అనంతరం గ్రామ కార్యదర్శులతో నర్సరీలలో పెంచుతున్న మొక్కల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కాలప్ప, ఎంపీఓ వెంకటేశ్వర్లు, సర్పంచ్ సుమంగళ, కార్యదర్శి సుమలత, ఎంపీటీసీ రవి పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం సహించం

నారాయణపేట రూరల్: విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ శ్రీహర్ష హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సెర్ప్ ఉద్యోగుల పనితీరుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాధ్యతగా విధులు నిర్వహించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారికి మెమోలు జారీ చేయాలని ఆదేశించారు. రుణాలు గ్రౌండింగ్ చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. స్త్రీనిధి రుణాలకు సంబంధించి ఫైల్స్ పరిశీలించి ప్రత్యేక సమీక్ష చేపట్టారు. సమావేశంలో డీఆర్‌డీఓ గోపాల్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ

మాగనూర్: స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ కోయ శ్రీహర్ష మంగళవారం మధ్యాహ్నం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. ఎలక్షన్ ఫామ్ 6, 7, 8 లను తనిఖీ చేశారు. ఎన్నికల సమయం వరకు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి రికార్డు తప్పకుండా మెయింటేన్ చేయాలన్నారు. అంతకుముందు మండల కేంద్రంలోని రైల్వేవంతెన వద్ద ఏర్పాటు చేసిన ఇసుక రీచ్‌ను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ సురేష్, మైనింగ్ ఆర్‌ఐ రమేష్, ఆర్‌ఐ శ్రీశైలం ఉన్నారు.

అంకితభావంతో విధులు నిర్వహించాలి



పోలీసులను అభినందిస్తున్న ఎస్పీ వెంకటేశ్వర్లు

నారాయణపేట రూరల్: విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయాలని ఎస్పీ వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం పలువురు పోలీసు అధికారులు, సిబ్బందిని అభినందించి కేపీఐ రివార్డ్స్ అందించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ ఫంక్షనింగ్ వర్టికల్స్‌లో విధులు నిర్వహిస్తూ మే నెలలో ప్రతిభ చూసిన వారిని ఎంపిక చేసిన 16 మందికి ప్రశంసాపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ విధి నిర్వహణలో సమయపాలన, అంకితభావం, పోటీతత్వం కలిగి ఉండాలన్నారు. ప్రజల మాన, ప్రాణ రక్షణకు అంకితం కావాలని, శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలన్నారు. అడిషనల్ ఎస్పీ నాగేంద్రుడు, డీసీఆర్‌బీ డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ కేసుల పరిష్కారంపై సమీక్ష

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల ఎస్పీలతో మంగళవారం డీజీపీ అంజనీకుమార్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాల వారీగా పెండింగ్ కేసులు, వాటి పరిష్కార మార్గాలు, క్రైమ్ రేటు, శాంతి భద్రతల పరిరక్షణలో తీసుకుంటున్న చర్యలపై మాట్లాడారు. వర్టికల్స్ పనితీరు, హెచ్‌ఆర్‌ఎంఎస్ వినియోగం, నేరాల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయడంపై అడిగి తెలుసుకున్నారు. ట్రైనింగ్స్, వర్క్‌షాప్స్‌పై చర్చించారు. డయల్ 100, సైబర్ నేరాల నియంత్రణకు చర్యలు, కళాజాత బృందాల పనితీరు, అవగాహన సదస్సుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. నారాయణపేట జిల్లా వివరాలను ఎస్పీ ఎన్ వెంకటేశ్వర్లు తెలిపారు. అనంతరం జిల్లా పోలీసులతో సమావేశమైన ఎస్పీ సమీక్ష నిర్వహించారు. డీజీపీ సమీక్షపై వివరించారు. ప్రతి పోలీసు సమస్యాత్మక గ్రామాల్లో పర్యటించాలని, నేరాల నియంత్రణకు కృషి చేయాలన్నారు. శాసనసభ ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సమావేశంలో అడీషనల్ ఎస్పీ నాగేంద్రుడు, డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్ మనక్‌పై ఓరియంటేషన్

నారాయణపేట రూరల్: ఇన్‌స్పైర్ అవార్డులకు సంబంధించి నామినేషన్ ప్రక్రియపై ఎస్‌సీఈఆర్‌టీ ఆధ్వర్యంలో టీసాట్ చానల్ ద్వారా మంగళవారం మధ్యాహ్నం 2గంటలకు టెలీకాన్ఫరెన్స్ ద్వారా కార్యక్రమం జరిగింది. జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలు వారివారి పాఠశాలల్లో ప్రొజెక్టర్ ద్వారా విద్యార్థులకు చూయించారు. పల్లె సృజన అధ్యక్షులు బ్రిగేడియర్, గణేశం, ప్రొఫెసర్ సురేష్ బాబు ఇన్‌స్పైర్ ప్రాజెక్టుల ప్రదర్శనలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎలాంటి ప్రాజెక్టులు ఎంపిక చేసుకోవాలి అనే అంశాలను వివరించారు. అదేవిధంగా గతంలో ప్రదర్శనకు వచ్చినవి, ఎంపిక కాబడ్డ వాటి చరిత్రను తెలియచేశారు. జాజాపూర్ స్కూల్‌లో డీఎస్‌ఓ భానుప్రకాష్, సైన్స్ ఫోరం కన్వీనర్ బీజీ కనకప్ప పాల్గొన్నారు.

కార్పొరేట్ కళాశాలలకు విద్యార్థుల ఎంపిక



నారాయణపేట రూరల్: కార్పొరేట్ కళాశాలల్లో చదువుకునేందుకు బీసీ విద్యార్థుల ఎంపిక ప్రక్రియ పూర్తయ్యింది. మంగళవారం వారికి కేటాయించిన కళాశాలకు సంబంధించి ప్రవేశ పత్రాలను బీసీ వెల్ఫేర్ అధికారి కృష్ణమాచారి అందజేశారు. మొదటి విడతలో 10మందికి గాను ఆరుగురికి కేటాయింపు జరిగిందని, ఒక్కో విద్యార్థికి ప్రభుత్వం రూ.38వేలు ఫీజు చెల్లిస్తుందని, అక్కడ మెటీరియల్, భోజనం ఉచితంగా అందుతుందని తెలిపారు. ప్రభు (నారాయణపేట), అశ్విత (దామరగిద్ద), వీణ (కోటకొండ), కృష్ణవేణి (ఊట్కూర్), శైలజ (ధన్వాడ), జ్ఞానేష్ (మరికల్)కు వనపర్తి సీవీ రామన్, పాలమూర్ ప్రతిభ, హస్తినాపూర్ కృష్ణవేణి కళాశాలల్లో సీటు లభించింది.

కాలంచెల్లిన విత్తనాలు స్వాధీనం

కోస్గి: ఓ ఫర్టిలైజర్ షాపులో టాస్క్‌ఫోర్స్, కోస్గి పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించగా, కాలంచెల్లిన విత్తనాలు పట్టుబడ్డాయి. ఈ సంఘటన కోస్గి మండలంలోని హకింపేటలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాసులు కథనం ప్రకారం... ఈ గ్రామానికి చెందిన మహాలక్ష్మి ఫర్టిలైజర్ దుకాణంలో కాలంచెల్లిన రాగులకు సంబంధించిన 11 ప్యాకెట్లు లభించాయి. వీటి విలువ సుమారుగా రూ.3,300 ఉంటుందని ఏఓ శరత్‌చంద్ర తెలిపారు. ఏఓ పంచనామా అనంతరం ఫర్టిలైజర్ షాపు యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.





మొక్కలు.. మేకలపాలు!

మాగనూర్: హరితహారం మొక్కల సంరక్షణను ఎవరూ పెద్దగా పట్టించుకోవడం లేదు. లక్ష్యం చేరుకునేందుకు మొక్కలను నాటడంపైనే దృష్టిసారిస్తున్నారు. కనీస రక్షణ చర్యలు చేపట్టకపోవడం వల్ల కనుమరుగవుతున్నాయి. మాగనూర్‌లో ఎన్‌హెచ్–167పై ఈ పరిస్థితి ఎదురైంది. రోడ్డు డివైడర్ మధ్యలో ఈ మధ్యనే మొక్కలు నాటారు. ఎలాంటి రక్షణ ఏర్పాటు చేయకపోవడంతో ఆ దారిలో వచ్చిన ఓ మేకల గుంపు మొక్కలను తినేశాయి. దీన్ని చూసిన స్థానికులు వాళ్లు నాటుడు సరే.. మూగజీవాలు తినుడు సరే అనుకుంటున్నారు.

నిలువురాళ్లను సందర్శించిన కలెక్టర్



నిలువురాళ్ల ప్రాంతంలో కలెక్టర్ శ్రీహర్ష

- పూర్తి వివరాలతో నివేదిక ఇవ్వాలని తహసీల్దార్‌కు ఆదేశాలు

కృష్ణా: మండలంలోని ముడుమాల్‌లో గల చారిత్రాత్మక నిలువురాళ్లను కలెక్టర్ శ్రీహర్ష మంగళవారం సందర్శించారు. స్థానిక నాయకులు, మండల అధికారులతో మాట్లాడారు. ఏ సర్వే నంబర్‌లో ఉన్నాయి? ప్రభుత్వ, పట్టాభూమి ఎంత? ఎన్ని ఎకరాల్లో విస్తరించి ఉందనే వివరాలను ఆరా తీశారు. పూర్తి వివరాలతో నివేదిక ఇవ్వాలని తహసీల్దార్ రమేష్‌ను ఆదేశించారు. నాలుగు రోజుల క్రితం నిలువురాళ్ల ప్రాంతాన్ని యునెస్కో గుర్తింపు కోసం సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ పుల్లారావు, డెక్కన్ హెరిటేజ్ ట్రస్ట్ సభ్యులు, వారి ప్రయత్నాలను కలెక్టర్‌కు వివరించడంతో ఆయన ఇక్కడికి వచ్చారని సమాచారం. వారితో పాటు ఎంపీడీఓ శ్రీనివాసులు, ఆర్‌ఐ అమర్‌నాథ్‌రెడ్డి, మధన్‌మోహన్‌రెడ్డి, సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పకడ్బందీగా గ్రూప్–4 పరీక్ష నిర్వహణ

- అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిట్టల్

నారాయణపేట రూరల్: జూలై 1న జిల్లాలో గ్రూప్–4 పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని అడిషనల్ కలెక్టర్ మయాంక్‌మిట్టల్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో చీఫ్ సూపరింటెండెంట్లు, లైజనింగ్ ఆఫీసర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పరీక్ష కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతుల కల్పన చేపట్టాలని, ద్యుయల్ డెస్క్ బేంచీలు, తాగునీరు, విద్యుత్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాలకు గట్టి భద్రత ఏర్పాటు చేయాలన్నారు. అభ్యర్థులను పూర్తిగా తనిఖీ చేసి లోపలికి పంపాలని, ఎలక్ట్రానిక్ వస్తువులను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించరాదన్నారు. జిల్లాలో 7,324 మంది పరీక్షకు దరఖాస్తు చేసుకున్నారని, వీరికి 28 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఉదయం, మధ్యాహ్నం రెండు పేపర్లు ఉంటాయన్నారు. పరీక్ష కేంద్రాల చుట్టూ 144 సెక్షన్ ఉంటుందన్నారు. జిరాక్స్ సెంటర్లు మూసి ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. సీఎస్, ఎల్‌ఓలు సమన్వయంతో పనిచేయాలని, ఇన్విజిలేటర్లకు తగిన శిక్షణ ఇవ్వాలని, అవగాహన రాహిత్యంతో సమయంలో జాప్యం చేయకుండా చూసుకోవాలన్నారు. సీసీకెమెరాలు ఏర్పాటు చేయాలని, పరీక్ష కేంద్రాలకు తగిన బస్సులు ఏర్పాటు చేయాలన్నారు.

చెత్తను రోడ్లపక్కన డంప్ చేయొద్దు



జిల్లా కేంద్రం శివారులో డంపింగ్‌యార్డును పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ మయాంక్‌మిట్టల్

పట్టణంలోని వివిధ వార్డుల్లో సేకరించిన చెత్తను డంపింగ్‌యార్డ్‌కు తరలించాలని అడిషనల్ కలెక్టర్ మయాంక్‌మిట్టల్ చెప్పారు. పట్టణ శివారులోని వైకుంఠధామం, డంపింగ్ యార్డ్‌లను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆటోలు ఇష్టారీతిగా రోడ్డుకు ఇరువైపులా చెత్తను పారబోస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, తప్పకుండా ఇంటింటి నుంచి తీసుకున్న చెత్తను డంపింగ్‌యార్డుల్లోనే వేసే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆటో డ్రైవర్లపై చర్యలు తీసుకోవాలన్నారు. వైకుంఠధామంలో అవసరమైన సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. పట్టణంలో ఇంజనీరింగ్ పనులు పర్యవేక్షించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ సునీత ఉన్నారు.

విధులు బహిష్కరించిన ఆర్టీసీ డ్రైవర్లు

నారాయణపేట రూరల్: ఆర్టీసీ బస్సుల్లో కండక్టర్ లేకుండానే డ్రైవర్ ఒక్కరితోనే వన్‌మెన్ సర్వీసులు నడిపిస్తున్నారు. అయితే దూర ప్రాంత సర్వీసులకు ఇది పరిమితం కాగా, తాజాగా పల్లెవెలుగుకు విస్తరించారు. నారాయణపేట డిపోలో ఇటీవల విద్యార్థుల సౌకర్యార్థం ఐదు సర్వీసులను స్కూల్ బస్సుల పేరుతో సిద్ధం చేశారు. కండక్టర్ లేకుండా కేవలం డ్రైవర్ మాత్రమే, కేటాయించిన గ్రామాలకు వెళ్లి విద్యార్థులను, టికెట్ కొనే ప్రయాణికులను సైతం తీసుకుని రావాల్సి ఉంటుంది. ఈ క్రమంలో టిమ్ ఉపయోగంపై గతంలో కొందరు డ్రైవర్లకు శిక్షణ ఇచ్చారు. రెండు రోజులుగా డ్యూటీలు తీసుకున్న వారు విధులు నిర్వహించగా, మంగళవారం కేటాయించిన వారు తాము టిమ్ సర్వీసు చేయలేమని చెప్పారు. విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. దీంతో ఆయా గ్రామాలకు బస్సులు వెళ్లక విద్యార్థులు అవస్థలుపడ్డారు. ప్రతీ స్కూల్ బస్సుకు ఉదయం రెండు ట్రిప్పులు, సాయంత్రం రెండు ట్రిప్పులు ఉండటంతో దాదాపు మధ్యలో 9గంటలు వృథాగా బస్టాండులో కాలక్షేపం చేయాల్సి వస్తుందని, వయస్సు మీద పడుతున్న వారికి టిమ్‌లపై శ్రద్ధ చూయించడం కష్టమని, చెప్పారు. ప్రమాదానికి కారణం అవుతాయని వాదిస్తున్నారు. దీనిపై డీఎం ఆంజనేయులు మాట్లాడుతూ.. వారి సమ్మతితోనే టిమ్ శిక్షణ ఇచ్చామని, డిపోలో మరో వారంరోజుల్లో వందశాతం టిమ్ శిక్షణ తీసుకోనున్నారని చెప్పారు. ఎవరికి డ్యూటీ వేసినా తప్పకుండా లైన్‌పైకి వెళ్లాలని చెప్పారు. డ్యూటీలను బహిష్కరించిన వారిపై చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

క్విజ్ పోటీల్లో రాణించాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న జిల్లా మానిటరింగ్ అధికారి

మరికల్: విద్యార్థుల తమ మేధాశక్తిని పరీక్షించుకునేందుకు క్విజ్ పోటీల్లో రాణించాలని జిల్లా మానిటరింగ్ అధికారి విద్యాసాగర్ అన్నారు. మరికల్ ఎంఈఓ కార్యాలయం ఆవరణలో మంగళవారం నర్వ, మరికల్ మండలాల ఉన్నత పాఠశాల విద్యార్థులకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ఒక్కో ఉన్నత పాఠశాల నుంచి 34 మంది పాల్గొన్నారు. వీరికి ఆర్థిక అక్షరాస్యతపై క్విజ్ పోటీ నిర్వహించారు. మరికల్ మండలం కన్మనూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మొదటి బహుమతి గెలుపొందారు. రెండో బహుమతి నర్వ మండలం ఉందేకోడ్ విద్యార్థులు, మూడో బహుమతి మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల విద్యార్థులు సొంతం చేసుకున్నారు. అనంతరం జిల్లా మానిటరింగ్ అధికారి మాట్లాడుతూ జిల్లాలో అన్ని మండల కేంద్రాల్లో క్విజ్ పోటీలు ఉంటాయన్నారు. గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా రూ.5వేలు, రెండో బహుమతిగా రూ.3వేలు ఆర్బీఐ బ్యాంకు తరపున ఇవ్వనున్నట్లు తెలిపారు. మండల స్థాయి విజేతలకు, జిల్లా స్థాయిలో గెలుపొందిన వారికి, రాష్ట్ర స్థాయిల్లో క్విజ్ పోటీలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి రామలింగం, ఎస్‌బీఐ మేనేజర్ శ్రీనివాస్ రాథోడ్, హెచ్‌ఎం దత్తాత్రి, అజీమ్, శివకుమార్, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డుప్రమాదంలో మాజీ సర్పంచ్ మృతి


ఠాగూర్‌నాయక్ (ఫైల్)

గోపాల్‌పేట: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో కారు యాక్సిడెంట్‌కు గురై ఆముదాలకుంట మాజీ సర్పంచు ఠాగూర్‌నాయక్ (50) మంగళవారం తెల్లవారుజామున మరణించాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. ఆముదాలకుంటకు చెందిన ఠాగూర్ నాయక్ సోమవారం పనిమీద సొంతకారులో కొంత మందితో కలిసి వెళ్లాడు. మంగళవారం తెల్లవారుజామున 4గంటల ప్రాంతంలో ఆగి ఉన్న వాహనాన్ని కారు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. ఆస్పత్రికి తీసుకువెళ్లగా మరణించాడు. ఠాగూర్‌నాయక్ చివరిసారి పొలికెపాడు సర్పంచ్‌గా పనిచేశారు.

యువకుడి ఆత్మహత్య


దిలీప్‌నాయక్ (ఫైల్)

కోస్గి: జీవనోపాధి కోసం హైదరాబాద్‌లో కారు డ్రైవర్‌గా పనిచేసే ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. బాధితులు, గ్రామస్తుల కథనం మేరకు.. మండలంలోని హన్మాన్‌పల్లి అనుబంధ తండా చింతగట్టుతండాకు చెందిన దిలీప్‌నాయక్(21) కొన్ని సంవత్సరాలుగా హైదరాబాద్‌లో కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబసభ్యులకు సమాచారం వచ్చింది. అయితే అతని మృతిపై అనుమానంతో కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మూడు రోజుల క్రితం బలవన్మరణం

నాగర్‌కర్నూల్ క్రైం: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శ్రీపురం గ్రామంలో చోటు చేసుకోగా.. మంగళవారం రాత్రి ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు కథనం ప్రకారం.. శ్రీపురం గ్రామానికి చెందిన మెరుగు సాయిలు (40) తన భార్య మూడురోజుల క్రితం అమ్రాబాద్ మండలం చింట్లంకుంటలోని తల్లిగారింటికి వెళ్లింది. మంగళవారం సాయిలు ఇంటి నుంచి దుర్వాసన రావడంతో అనుమానం వచ్చి చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై విజయ్ కుమార్ సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై ఎవరూ ఫిర్యాదు చేయలేదని పోలీసులు తెలిపారు.

పీహెచ్‌సీలో ఎన్‌క్యూఏఎస్ బృందం పరిశీలన



దామరగిద్ద: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఢిల్లీకి చెందిన నేషనల్ క్వాలిటీ అసూరెన్స్ స్టాండర్డ్ (ఎన్‌క్యూఏఎస్) బృందం సందర్శించింది. రెండురోజులపాటు ఆరోగ్య కేంద్రం పనితీరును పరిశీలించి నివేదిక సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. ఎన్‌క్యూఏఎస్ బృందం వైద్యులు సింగా, డాక్టర్ ఎలిజిబెత్ మెకాలే వర్గెస్ వైద్యకేంద్రంలో ఓపీ, ఐపీ, ఆపరేషన్ థియేటర్, ల్యాబ్, మెడిసిన్, ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న సేవలను పరిశీలించారు. సవిల్ వర్క్, ప్రహరీ, హరితహారం, పరిసరాల పరిశుభ్రత, తాగునీటి సదుపాయాల గురించి తెలుసుకున్నారు. ఆస్పత్రి సేవలపై నివేదిక సిద్ధం చేసి ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు వారు వివరించారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ రాంమోహన్‌రావు, డిప్యూటీ డీఎంహెచ్ఓ శైలజ, ఎన్‌సీడీ పీఓ సౌభాగ్యలక్ష్మి, పీఓ బాలాజీ, డీపీఓ భిక్షపతి, వైద్యాధికారి నాగజ్యోతి, గౌతంరెడ్డి, రాజచంద్ర, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

మహమ్మదాబాద్ పీహెచ్‌సీలో..

మహమ్మదాబాద్: స్థానిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం కేంద్ర ఆరోగ్య శాఖ డాక్టర్ పర్వీన్ సుల్తానా ఆధ్వర్యంలో కేంద్రం బృందం తనిఖీ చేసింది. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో వసతులు, నిత్యం ఎంతమంది చికిత్సకు వస్తారు.. ఎలాంటి మందులు, సౌకర్యాలు ఉన్నాయని వైద్యాధికారి రహమత్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రసవాలు ఎక్కువగా ఆరోగ్య కేంద్రంలోనే చేయాలని సూచించారు. అనంతరం మహమ్మదాబాద్, మొకర్లాబాద్ సబ్‌సెంటర్లను సందర్శించి వాటి పనితీరు, సేవల గురించి ఆరాతీశారు. కార్యక్రమంలో కేంద్ర బృందం సభ్యులు స్టేట్ కన్సల్టెంట్ లక్ష్మణ్, టెక్నికల్ ఆఫీసర్ శ్రీనివాస్, డీఎంఓ శ్వేత, సీడీహెచ్ఓ అబ్దుల్‌వాసి, సబ్‌యూనిట్ ఆఫీసర్ రమేష్, ఎన్‌సీడీ కోఆర్డినేటర్ నాగరాజు శెట్టి తదితరులు పాల్గొన్నారు.



తీరనున్న వంతెన కష్టాలు

రఘుపతిపేట బ్రిడ్జి నిర్మాణానికి రూ.45 కోట్లు మంజూరు


వాగులో చిక్కుకున్న ఆర్టీసీ బస్సు (ఫైల్)


రఘుపతిపేట- రామగిరి శివారులో ఉధృతంగా పారుతున్న దుందుభీ వాగు (ఫైల్)

కల్వకుర్తి రూరల్: మండలంలోని రఘుపతిపేట, రామగిరి గ్రామాల ప్రజల వానాకాలం కష్టాలు ఎట్టకేలకు తీరనున్నాయి. ఆయా గ్రామాల మీదుగా పారుతున్న దుందుభీ వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం రూ.45 కోట్లు మంజూరు చేయడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రఘుపతిపేటకు చెందిన రైతులతోపాటు తెలకపల్లి, అచ్చంపేటకు వెళ్లే ప్రయాణికులు దుందుభీ వాగు ఉధృతంగా ప్రవహించే సందర్భంలో అనేక ఇబ్బందులు పడుతున్నారు. రఘుపతిపేట, రామగిరి మధ్యలో ఉన్న దుందుభీ వాగు గత మూడేళ్లుగా ఉధృతంగా ప్రవహిస్తున్న సమయంలో దాదాపు నెలరోజులపాటు రాకపోకలకు అంతరాయం కలిగేది. ఈ క్రమంలో తెలకపల్లి, కల్వకుర్తి, లింగాల, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్ వెళ్లే వాహనచోదకులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతంగా ఉండేవి. రఘుపతిపేటతోపాటు నడిగడ్డ, రామగిరి తదితర గ్రామాల విద్యార్థులు తెలకపల్లి వెళ్లి చదువుకోవడానికి సాహసమే చేయాల్సి వచ్చేది. ఈ నేపథ్యంలో వాగు ఉధృతంగా పారుతున్న సమయంలో ఎన్నో ప్రమాదాలు చోటుచేసుకుని పలువురు త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు.

ఫలించిన ప్రయత్నాలు..

కల్వకుర్తి నుంచి రఘుపతిపేట మీదుగా దుందుభీ వాగుపై తెలకపల్లి, లింగాల, అచ్చంపేట, నాగర్‌కర్నూల్ తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రజలు, ప్రయాణికుల కష్టాలు తీరనున్నాయి. భారీగా వర్షాలు కురిస్తే వాగు ఉధృతంగా ప్రవహిస్తున్న సమయంలో వాహనాలు వెళ్లకుండా బారీకేడ్లు ఏర్పాటు చేసేవారు. ఈ సమస్య పరిష్కారానికి నాగర్‌కర్నూల్ ఎంపీ రాములు చేసిన ప్రయత్నాలతో ప్రభుత్వం బ్రిడ్జి నిర్మాణానికి ఆమోదం తెలిపింది. వెంటనే నిర్మాణం చేపట్టి కల్వకుర్తి, తెలకపల్లి మండల ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని జిల్లావాసులు కోరుతున్నారు.

సీఎంకు కృతజ్ఞతలు..

దుందుభీ వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.45 కోట్లు మంజూరు చేస్తూ సోమవారం రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని ఎంపీ రాములు చెప్పారు. నిధులు మంజూరు చేసిన సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ బ్రిడ్జి నిర్మాణంతో కొల్లాపూర్ నేషనల్ హైవేతోపాటు లింగాల, కల్వకుర్తి, హైదరాబాద్‌కు దూరభారం తగ్గుతుందన్నారు. బ్రిడ్జి నిర్మాణం త్వరగా చేపట్టేలా చర్యలు తీసుకుంటానన్నారు. ఎన్నికల సందర్భంగా తాను ఇచ్చిన హామీని నెరవేర్చడం సంతోషంగా ఉందని చెప్పారు.

రేషన్ బియ్యం పట్టుకున్న పోలీసులు


పోలీసులకు పట్టుబడిన బియ్యం వాహనం

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని కొత్తకోట బైపాస్ 44వ జాతీయ రహదారిపై అక్రమంగా 40 క్వింటాల రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న వాహనాన్ని మంగళవారం పోలీసులు పట్టుకున్నారు. కేసు నమోదు చేశారు. మదనాపురం మండలానికి చెందిన వెంకటేష్ అలంపూర్ ప్రాంతాల్లో ప్రజల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి పౌల్ట్రీఫామ్ పెంపకందారులకు అమ్ముకోవడానికి వ్యాపారం చేస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం తెల్లవారుజామున బొలేరా వాహనంలో రేషన్ బియ్యం తీసుకుని వస్తుండగా సమాచారం మేరకు సివిల్ సప్లయ్ అధికారులు వేణు, పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. వాహనంలో రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించి డీటీ వేణు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రేషన్ బియ్యం తీసుకుంటున్న వెంకటేష్, డైవర్ కురుమూర్తిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ జగదీష్ తెలిపారు.

కిడ్నాప్ కేసులో ఇద్దరు రిమాండ్

గద్వాల క్రైం: మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను ఈ నెల 19న మాయమాటలు చెప్పి అపహరించిన కేసులో మంగళవారం ఇద్దరు యువకులను రిమాండ్ చేయడంతోపాటు మరో మైనర్‌ను జువైనల్ కోర్టుకు తరలించినట్లు గద్వాల సీఐ చంద్రశేఖర్ తెలిపారు. అయిజకు చెందిన వెంకటేష్, మల్దకల్ మండలం పాల్వాయి గ్రామానికి చెందిన లక్ష్మణ్, గద్వాల మండలానికి చెందిన ఓ బాలుడు బాలికను కిడ్నాప్ చేశారు. రూరల్ పోలీసులు ముగ్గురిపై పోక్సో కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టగా.. మంగళవారం గద్వాల శివారులో ఉన్నట్లు అందిన సమాచారం మేరకు వారిని అదుపులోకి తీసుకుని.. బాలికను తల్లిదండ్రులకు అప్పగించామన్నారు. వీరిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి తీర్పు మేరకు ఇద్దరు యువకులను రిమాండ్‌కు, బాలుడిని జువైనల్ కోర్టుకు తరలిస్తున్నట్లు సీఐ తెలిపారు.

యువకుడి రిమాండ్

వెల్దండ: ఊర్కొండ మండలం జకినాలపల్లికి చెందిన పోలే కొండల్‌పై కేసు నమోదు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు వెల్దండ సీఐ రామకృష్ణ తెలిపారు. వివరాలిలా.. జకినాలపల్లికి చెందిన సావిత్రి ఈ నెల 19న వెల్దండ మండలం కొట్ర గ్రామంలోని అక్క మాధవి వద్దకు వెళ్లింది. తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నట్లు ఈనెల 22న కొట్ర నుంచి వెళ్లిపోయింది. ఇంటికి తిరిగి రాకపోవడంతో బాలిక తండ్రి రాములు వెల్దండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో యువతి మిస్సింగ్ కేసు నమోదు చేశారు. బాలిక ఆచూకీ కోసం పోలీసులు వెతకడంతో జకినాలపల్లికి చెందిన పోలే కొండల్ బాలికను ప్రేమ, పెళ్లి పేరుతో మోసం చేసి శ్రీశైలం తీసుకెళ్లాడని, ఈ మేరకు నిందితుడిని అరెస్టు చేసి కల్వకుర్తి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

చోరీ కేసులో..

పాన్‌గల్: తెల్లరాళ్లపల్లి, కేతేపల్లి ఆలయాల్లో జరిగిన చోరీ కేసులకు సంబంధించి నిందితుడికి ఏడు నెలల జైలుశిక్ష పడినట్లు ఎస్ఐ రవిప్రకాష్ మంగళవారం తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం.. తెల్లరాళ్లపల్లిలోని ఆలయంలో 2021లో, కేతేపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో 2022 సంవత్సరంలో జరిగిన చోరీ కేసుకు సంబంధించి పెద్దకొత్తపల్లి మండలం గంట్రావ్‌పల్లికి చెందిన పెద్దముక్కల ఈశ్వర్‌పై కేసు నమోదు చేశారు. ఇతనిపై నేరం రుజువు కావడంతో వనపర్తి అదనపు జుడీషియల్ ఫస్ట్ క్లాస్ కోర్టు మెజిస్ట్రేట్ 7 నెలల జైలుశిక్ష విధిస్తూ తీర్పుచెప్పారన్నారు. ఈ మేరకు నిందితుడి నుంచి వెండి, రాగి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామన్నారు.

పాముకాటుతో మహిళ మృతి


మేగీ (ఫైల్)

చారకొండ: మండల పరిధిలోని అగ్రహారంతండాకు చెందిన మహిళ మంగళవారం పాముకాటుకు గురై మృతి చెందింది. ఆ వివరాలు.. తండాకు చెందిన నేనావత్ మేగీ (45) తమ వ్యవసాయ పొలంలో పనులు చేస్తుండగా చేతి బొటనవేలుకు పాము కాటువేసింది. దాంతో పక్కన పొలంలో ఉన్న వారికి చెప్పింది. వారు వచ్చేసరికి ఆమె అక్కడే మృతిచెందిందని గ్రామస్తులు తెలిపారు. మేగికి భర్త, ఇద్దరు ఆడపిల్లలు, కుమారుడు ఉన్నారు.

దాడి చేసిన వారిపై కేసు నమోదు

గద్వాల క్రైం: చోరీకి పాల్పడుతున్న గుర్తుతెలియని దుండగులను పట్టుకునే ప్రయత్నంలో చిరు వ్యాపారిపై దాడికి పాల్పడిన నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామస్వామి తెలిపారు. పాత బస్టాండ్ సమీపంలో ఫుట్‌పాత్‌పై పప్పులు విక్రయిస్తున్న దౌలత్ డబ్బా వద్దకు గుర్తుతెలియని ముగ్గురు వచ్చి డబ్బాలోని నగదు అపహరించే ప్రయత్నం చేశారు. వ్యాపారి వారిని పట్టుకునే ప్రయత్నం చేయగా దౌలత్‌పై దాడికి పాల్పడ్డారు. గమనించిన స్థానికులు పట్టుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.



ఎస్పీకి అభినందన

డీజీపీ నుంచి అభినందన పత్రం తీసుకుంటున్న ఎస్పీ కె.నరసింహ

జిల్లా పోలీస్ శాఖ 2023 మొదటి త్రైమాసిక నివేదిక ప్రకారం జిల్లాలో మొబైల్ ఫింగర్ ప్రింట్ లైవ్ స్కానర్ ఉపయోగించి అనుమానాస్పద వ్యక్తుల వివరాలు ధ్రువీకరణతో పాటు ఫింగర్ ప్రింట్ సేవలలో ఉత్తమ ఫలితాలు సాధించిన క్రమంలో ఎస్పీ కె.నరసింహను మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో డీజీపీ అంజనీకుమార్ అభినందన పత్రంతో సత్కరించారు. ఇటీవల కాలంలో జిల్లా పోలీస్‌శాఖ పనితీరును మెరుగుపర్చడానికి ఎస్పీ ప్రత్యేక దృష్టి సారించారు.

– మహబూబ్‌నగర్ క్రైం

విద్యార్థుల గొడవపై ఆరా



ఉప్పునుంతల: స్థానిక బీసీ హాస్టల్‌ను మంగళవారం ఉదయం జిల్లా బీసీ సంక్షేమాధికారి శ్రీధర్‌జీ సందర్శించారు. సోమవారం రాత్రి హాస్టల్ విద్యార్థి నరేష్‌కు కత్తిపోట్లకు దారి తీసిన సంఘటనకు సంబంధించిన వివరాలు, కారణాలను వార్డెన్ రమేష్, తోటి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ప్రభుత్వ హాస్టల్‌లో కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని శ్రద్ధగా చదువుకోవాలని సూచించారు. హాస్టల్‌లో అందుబాటులో సంరక్షకుని స్థానంలో ఉంటూ విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంతోపాటు వారిలో మార్పు తేవడానికి కృషిచేయాలని వార్డెన్‌కు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారి స్థానిక విలేకరులతో మాట్లాడుతూ హాస్టల్ విద్యార్థి కత్తిపోట్లకు గురికావడం దురదృష్టకరమన్నారు. నరేష్ అనే విద్యార్థి గతేడాది 9వ తరగతి హాస్టల్‌లో ఉంటూ చదివి ఈ ఏడాది మంగళవారం సాయంత్రమే హాస్టల్‌కు వచ్చాడని, 10వ తరగతి కోసం పాఠశాల బోనోఫైడ్ సమర్పించి రెన్యువల్ కూడా చేసుకోలేదన్నారు. అలాగే నరేష్‌ను కత్తితో పొడిచిన రాము సైతం గతేడాది హాస్టల్‌లోనే 8వ తరగతి చదువుకొని ప్రస్తుతం 9వ తరగతి కోసం హాస్టల్‌కు రాలేదన్నారు. ఈ ఇరువురు విద్యార్థులు ప్రేమ వ్యవహారంలో ఒకరిపై ఒకరు కక్ష పెంచుకొని హాస్టల్ బయట దాడి చేసుకున్నారని వివరించారు. ఇలాంటి ఘటన లు పునరావృతం కాకుండా జిల్లాలోని బీసీ హాస్టళ్ల వార్డెన్లను అప్రమత్తం చేస్తామన్నారు.

జువైనల్ హోంకు తరలింపు

ఉప్పునుంతలలో సోమవారం రాత్రి హాస్టల్ విద్యార్థిపై కత్తితో దాడికి పాల్పడిన ఇద్దరు మైనర్ విద్యార్థులను హత్యాయత్నం కేసులో మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా జువైనల్ జడ్జి ఎదుట హాజరుపర్చినట్లు ఎస్ఐ గురుస్వామి తెలిపారు. జడ్జి ఆదేశాల మేరకు వారిని హైదరాబాద్‌లోని జువైనల్ హోంకు తరలించామని చెప్పారు.

జోగుళాంబ సన్నిధిలో సచ్చిదానంద సరస్వతి

జోగుళాంబ శక్తిపీఠం: అష్టాదశ శక్తిపీఠాల్లో అయిదో శక్తిపీఠమైన అలంపూర్ జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామివారి ఆలయాలను మంగళవారం ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా తుని తపోవన ఆశ్రమాధిపతి శ్రీసచ్చిదానంద సరస్వతి దర్శించుకున్నారు. చతుర్మాస దీక్షకు ముందు శృంగేరి మహాస్వామి ఆశీస్సులు పొందేందుకు వెళ్తూ మార్గమధ్యంలో గల శక్తిపీఠమైన జోగుళాంబ తల్లి ఆశీస్సులు పొందేందుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారికి ఆలయ మర్యాదలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. ప్రధాన ఆలయమైన బాలబ్రహ్మేశ్వరుడికి ఏకవార రుద్రాభిషేకాలు, అలాగే జోగుళాంబ అమ్మవారికి గర్భాలయంలో శ్రీచక్రార్చనలు చేశారు. ఈ సందర్భంగా వారు భక్తులనుద్దేశిస్తూ ఆశాఢమాసంలో అమ్మవారి ప్రాశస్త్యంను వివరించారు. అమ్మవారి ఆరాధనకు ఈ మాసం ఎంతో విశిష్టమైనదని చెప్పారు. ఆశాఢంలో చేసే దీక్షలను గుప్తనవరాత్రులుగా చెబుతారన్నారు. చతుర్మాస దీక్ష ముగియగానే తాను మరోమారు జోగుళాంబ తల్లిని దర్శించుకుంటానని, అలాగే బాలబ్రహ్మేశ్వరుడి ఆరాధన చేయాలన్న తన సంకల్పాన్ని దేవస్థానం వారికి తెలియజేశారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ అర్చకులకు, దేవస్థానం సిబ్బందికి ప్రసాదాలు ఇచ్చి ఆశీర్వదించారు.



నల్లమలలో పెరిగిన పులులు


కొల్లాపూర్ అటవీ రేంజ్ పరిధిలో సంచరిస్తున్న పులులు

కొల్లాపూర్: కొల్లాపూర్ ఫారెస్టు రేంజ్ పరిధిలోని నల్లమల అటవీ ప్రాంతంలో పులుల సంచారం పెరిగినట్లు ఫారెస్టు రేంజర్ శరత్‌చంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కొల్లాపూర్ ఫారెస్టు రేంజ్ పరిధిలో 8 పెద్ద పులులు, 20 చిరుతలు సంచరిస్తున్నాయని పేర్కొన్నారు. పులులతో పాటు జింకలు, దుప్పులు, సాంబార్లు, ఎలుగుబంట్లు ఇతర జంతువుల సంఖ్య కూడా పెరిగిందని వివరించారు. నల్లమల అడవిలో నీటి వనరులు పుష్కలంగా ఉండడం, ఆహారం సమృద్ధిగా లభిస్తుండడంతో పులులు, ఇతర జంతువుల సంఖ్య కూడా పెరుగుతోందన్నారు. మూవ్‌మెంట్ కాప్చర్ కెమెరాల ద్వారా వన్యప్రాణుల ఆనవాళ్లు గుర్తించినట్లు తెలిపారు. అటవీశాఖ అధికారుల అనుమతులు లేకుండా ప్రజలు ఎవరూ నల్లమల అడవిలోకి ప్రవేశించవద్దని సూచించారు.

తుంకినీపూర్ శివారులో చిరుత సంచారం


తుంకినీపూర్ రైతులతో మాట్లాడుతున్న అటవీశాఖ సిబ్బంది

అడ్డాకుల: మూసాపేట మండలం తుంకినీపూర్ శివారులో చిరుత పులి సంచరిస్తోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేముల రోడ్డులోని పెద్ద గుట్ట పరిసరాల్లో మూసాపేటకు చెందిన రజినీసాగర్ వ్యవసాయ భూముల్లో చిరుత సంచరించడాన్ని స్థానిక రైతులు గుర్తించి మంగళవారం జిల్లా అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసులు, బీట్ ఆఫీసర్ శశికళ పెద్ద గుట్ట పరిసరాల్లోని వ్యవసాయ భూములకు వెళ్లి చిరుత జాడలను పరిశీలించామని, ఎక్కడా కనిపించలేదని తెలిపారు. ఏదేమైనా రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పొలాల వద్ద ఆవులు, గేదెలను కట్టేయకుండా కొన్నాళ్ల పాటు ఊర్లోకి తీసుకెళ్లాలని చెప్పారు. ఇదిలా ఉండగా కొన్నాళ్ల నుంచి తుంకినీపూర్, వేముల, చక్రాపూర్, అద్దాయపల్లి, కొమిరెడ్డిపల్లి శివారులో చిరుత పులి సంచరిస్తోంది. అయితే వ్యవసాయ పనులు మొదలైన సమయంలో చిరుత సంచరిస్తోందన్న సమాచారంతో ఆయా గ్రామాల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అటవీశాఖ అధికారులు చిరుత సంచారంపై దృష్టి పెట్టి దాన్ని పట్టుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్


ముఠా సభ్యులు, స్వాధీనం చేసుకున్న బైక్‌లను చూపిస్తున్న పోలీసులు

- 10 ద్విచక్రవాహనాల స్వాధీనం

కృష్ణా: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక ప్రాంతాల్లోని రైల్వేస్టేషన్ల ఎదుట నిలిపిన ద్విచక్రవాహనాల చోరీకి పాల్పడుతున్న ముగ్గురు అంతర్రాష్ట్ర దొంగల ముఠాను పట్టుకున్నట్లు మక్తల్ సీఐ సీతయ్య తెలిపారు. కృష్ణా ఎస్ఐ విజయభాస్కర్ ఆధ్వర్యంలో మంగళవారం ఇద్దరు నిందితులను అరెస్టు చేయడంతోపాటు 10 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణా పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ సీతయ్య వివరాలు వెల్లడించారు. కొన్నిరోజుల క్రితం కృష్ణాకు చెందిన లక్ష్మణ్ తన ద్విచక్రవాహనాన్ని అపహరించారని ఫిర్యాదు చేయడంతో పూర్తిస్థాయిలో విచారణ చేపట్టారు. ఈ క్రమంలో ప్రధాన నిందితుడు కర్ణాటకలోని బాచిమట్టి గ్రామానికి చెందిన మానప్ప, అదే గ్రామానికి చెందిన అశోక్, సురుపూర్‌కు చెందిన సిద్ధు ముఠాగా ఏర్పడి ద్విచక్రవాహనాలను అపహరిస్తున్నారు. ఇందులో మానప్ప, అశోక్ అనుమానాస్పదంగా కనిపించడంతో పట్టుకొని విచారించగా నేరం అంగీకరించారు. ముఠాలోని సభ్యుడు సిద్ధు పరారీలో ఉన్నాడన్నారు. ఈ మేరకు నిందితులను నుంచి 10 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని ఇద్దరిని రిమాండ్‌కు పంపించామన్నారు.

ఆరు ఇసుక టిప్పర్ల పట్టివేత


దేవరకద్ర తహసీల్దార్ కార్యాలయం బయట నిలిపి ఇసుక టిప్పర్లు

దేవరకద్ర: పట్టణంమీదుగా జిల్లా కేంద్రానికి మంగళవారం సాయంత్రం ఆరు టిప్పర్లలో ఇసుకను తీసుకెళుతుండగా దేవరకద్ర రెవెన్యూ అధికారులు పట్టుకుని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. మాగనూర్ రిచ్ పాయింట్ నుంచి నారాయణపేట బిల్లు వేబిల్లులు ఉన్న టిప్పర్లు మహబూబ్‌నగర్ వెలుతుండడంతో వాటిని పట్టుకుని విచారణ చేపట్టారు. జిల్లాకేంద్రంలోని సూపర్ స్పెషలిటీ ఆస్పత్రికి ఇసుకను తరలిస్తున్నట్లు టిప్పర్ల డ్రైవర్లు తెలపడంతో దానికి సంబంధించిన అనుమతి పత్రాలు చూపించాలని తహసీల్దార్ జ్యోతి తెలిపారు. అనుమతి పత్రాలు తెచ్చి టిప్పర్లను తీసుకుపోవాలని ఆమె సూచించారు. అనుమతి ఒక చోటకు ఉంటే మరో చోటకి ఎలా తరలిస్తారని డ్రైవర్లను నిలదీశారు. ప్రస్తుతం ఇసుక టిప్పర్లను తహసీల్దార్ కార్యాలయం బయటనే నిలిపివేశారు.

క్లుప్తంగా...

పోలీస్ శిక్షణకు ముమ్మర ఏర్పాట్లు

28 పోలీస్ శిక్షణ కేంద్రాలు సిద్ధం చేయాలని డీజీపీ ఆదేశం



సాక్షి, హైదరాబాద్: త్వరలో భర్తీ కానున్న నూతన కానిస్టేబుళ్ల శిక్షణపై పోలీస్ ఉన్నతాధికారులు దృష్టి సారించారు. ఇప్పటికే నియామక ప్రక్రియ తుది దశకు చేరుకుంది. దీంతో త్వరలో భర్తీ కానున్న 14,881 మంది పోలీస్ కానిస్టేబుళ్లకు శిక్షణనిచ్చేందుకు రాష్ట్రంలోని 28 పోలీస్ శిక్షణ కేంద్రాల్లో పూర్తిస్థాయి ఏర్పాట్లు చేయాలని డీజీపీ అంజనీ కుమార్ ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం ఆయన రాష్ట్రంలోని అన్ని పోలీస్ ట్రైనింగ్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో వీడియో సదస్సు నిర్వహించారు. శిక్షణ విభాగం ఐజీ తరుణ్ జోషితో కలిసి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా డీజీపీ అంజనీ కుమార్ మాట్లాడుతూ...రానున్న సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో శిక్షణ కార్యక్రమాలను ప్రారంభించనున్నామని వెల్లడించారు. శిక్షణ ప్రారంభానికి ముందుగానే అన్ని పోలీస్ ట్రైనింగ్ సెంటర్లలో (పీటీసీ) మౌలిక సదుపాయాల కల్పన, శిక్షణకు కావాల్సిన మెటీరియల్స్, వసతి తదితర సౌకర్యాలను సిద్ధం చేసుకోవాలని పీటీసీల అధికారులను ఆదేశించారు. భవనాలకు మరమ్మతులు, వైట్‌వాష్, టాయిలెట్ల సౌకర్యం, రీడింగ్ రూమ్ తదితర ఏర్పాట్లకు నిధులను అందచేస్తున్నామన్నారు. మహిళా ట్రైనీ పోలీస్ కానిస్టేబుల్ శిక్షణకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని తెలిపారు.

నేడు, రేపు తేలికపాటి వానలు

సాక్షి, హైదరాబాద్: ఒడిశా దాని పరిసరాల్లోని దక్షిణ జార్ఖండ్, ఉత్తర ఛత్తీస్‌గఢ్ వద్ద ఉన్న అల్పపీడనం మంగళవారం తెలంగాణ నుండి దూరంగా వెళ్లిపోయిందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. కాగా, రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు సాధారణ స్థితిలో ఉన్నాయి. దీంతో బుధ, గురువారాల్లో రాష్ట్రంలో అక్కడక్కడ తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది. గత 24 గంటల్లో ఆదిలాబాద్ సహా ఆ జిల్లాలోని థంసి, కొమురంభీం జిల్లా సిర్పూరుల్లో 5 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది. కెరమెరి, తాల మడుగు, బెజ్జూరు, కాగజ్‌నగర్, వంకడి, ఆసిఫాబాద్, రంజాల్, జైనూర్, నవీపేట్‌లలో 3 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది.

దేవరకొండ కాలేజీ ప్రాంగణంలో మార్కెట్టా?

నల్లగొండ కలెక్టర్ ఉత్తర్వులను నిలిపివేసిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: దాదాపు వేయి మంది విద్యార్థులు చదివే జూనియర్ కాలేజీ, ప్రాథమిక, ఉన్నత పాఠశాల ఉన్న స్థలంలో వెజ్, నాన్ వెజ్ మార్కెట్ ఎలా ఏర్పాటు చేస్తారని అధికారులను హైకోర్టు ప్రశ్నించింది. ఇది ఎంత మాత్రం సమర్థనీయం కాదంటూ గత సంవత్సరం డిసెంబర్ 9న నల్లగొండ కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులను నిలిపివేసింది. తదుపరి వెల్లడించే వరకు ఈమధ్యంతర ఆదేశాలే అమలులో ఉంటాయని స్పష్టం చేసింది. విద్యాశాఖ కమిషనర్, నల్లగొండ కలెక్టర్, దేవరకొండ ఆర్డీవో, తహసీల్దార్‌సహా పలువురికి నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణ నాటికి కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. నల్లగొండ జిల్లా దేవరకొండలో కళాశాలకు చెందిన 11 ఎకరాల భూమిలో 2 ఎకరాల్లో మార్కెట్ నిర్మాణం చేపట్టాలంటూ కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలపై హైకోర్టులో దేవరకొండకు చెందిన టి.రవికుమార్ ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది తేరా రజినీకాంత్‌రెడ్డి వాదనలు వినిపించారు.

ఆగస్టు 30 వరకు ప్రత్యేక రైళ్ల పొడిగింపు

సాక్షి, హైదరాబాద్: దక్షిణమధ్య రైల్వేలోని వివిధ మార్గాల్లో అందుబాటులోకి తెచ్చిన 23 ప్రత్యేక రైళ్లను పొడిగించారు. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఆగస్టు 30 వరకు పొడిగించనున్నట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్.రాకేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సికింద్రాబాద్–సుబేదార్‌గంజ్, లింగంపల్లి, కాకినాడ, కాచిగూడ–మధురై, సికింద్రాబాద్–రామనాథపురం, సికింద్రాబాద్–పట్నా, సికింద్రాబాద్–దానాపూర్, కాచిగూడ–నాగర్‌సోల్, తదితర మార్గాల్లో నడిచే రైళ్లను ఆగస్టు చివరి వరకు నడపనున్నట్లు పేర్కొన్నారు.

పండరీపూర్, తుల్జాభవానీ ఆలయాలను సందర్శించుకున్న ముఖ్యమంత్రి కేసీఆర్





సర్కోలి సభకు హాజరైన ప్రజలు.. భగీరథ్ బాల్కేకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కేసీఆర్





మాది రైతుల టీం

▶ మొదటి పేజీ తరువాయి

మాదిరిగా దేశంలోని ఇతర ప్రాంతాల్లో ఎందుకు అభివృద్ధి సాధ్యం కాలేదని ప్రశ్నించారు. దేశంలో కోట్లాది ఎకరాల వ్యవసాయ భూమి, 75 వేల టీఎంసీల నీరు ఉందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సరైన విధానాలు అమలు చేస్తే ప్రతీ ఎకరాకు సాగునీరు అందించవచ్చన్నారు. నూతన జల విద్యుదుత్పత్తి విధానాలను బీఆర్ఎస్ లక్ష్యంగా పెట్టుకుందని చెప్పారు. దేశంలోని బొగ్గు నిల్వలు 150 సంవత్సరాలపాటు అవసరాలను తీరుస్తాయని, రైతులు ఏకమైతేనే సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతు బీమా వంటి తెలంగాణ పథకాలు మహారాష్ట్రలోనూ అమలు కావాలన్నారు. పనిచేయని ప్రభుత్వాన్ని తరిమికొట్టాలని, రైతుల కోసం పనిచేసే ప్రభుత్వాన్ని తెచ్చుకుందామని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్‌లో చేరిన భగీరథ బాల్కేను ఎమ్మెల్యేగా గెలిపిస్తే మంత్రిని చేస్తానని కేసీఆర్ ప్రకటించారు.

రైతు బతికుంటేనే ప్లేటులోకి భోజనం

'రైతు బతికుంటే ఎవరు మరణిస్తారు, రైతు మరణిస్తే ఎవరు బతుకుతారని నేను నిత్యం చెబుతుంటాను. రైతు జీవించి ఉంటేనే భోజనం మన ప్లేటులోకి వస్తుంది. రైతు మరణిస్తే అందరి భోజన పాత్రలు ఎండిపోతాయి. రైతులు లేకుంటే ఇక ఎవరు బతకగలరు' అని కేసీఆర్ చెప్పారు. మహారాష్ట్రలో బీఆర్ఎస్ సర్కారు ఏర్పడితే రైతులందరికీ పెన్షన్ ఇవ్వడంతోపాటు సంక్షేమ కార్యక్రమాలన్నీ అమలు చేస్తామన్నారు. 'తుమ్మచెట్టును నాటితే మామిడి పండ్లు ఎలా కాస్తాయి. మామిడి పండ్లు తినాలనుకుంటే మామిడి చెట్టునే నాటాలి. పాలు కావాలంటే ఆవులకు గడ్డి వేయండి, గాడిదలకు గడ్డి వేసి, ఆవుల నుండి పాలు ఎలా పొందగలం' అంటూ ఓటు శక్తితో అసాధ్యాలను సుసాధ్యం చేయవచ్చని కేసీఆర్ అన్నారు.

ముగిసిన మహారాష్ట్ర పర్యటన

రెండురోజుల పర్యటనకు రోడ్డు మార్గంలో భారీ కాన్వాయ్‌తో వెళ్లిన కేసీఆర్ మంగళవారం రాత్రి హైదరాబాద్‌కు తిరిగి చేరుకున్నారు. సోమవారం రాత్రి షోలాపూర్ బాలాజీ సరోవర్ హోటల్‌లో బస చేసిన కేసీఆర్ మంగళవారం ఉదయం రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఇతర ముఖ్య నేతలతోపాటు పండరీపూర్‌కు చేరుకున్నారు. 10 గంటలకు పండరీపూర్‌లోని శ్రీ విఠల్ రుక్మిణిదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం సర్కోలిలోని భగీరథ బాల్కే నివాసానికి చేరుకుని ఆయన తండ్రి స్మారకానికి నివాళి అర్పించారు. అనంతరం జరిగిన సభలో కేసీఆర్ ప్రసంగించారు. తర్వాత పార్టీ నేతలతో కలిసి భాల్కే నివాసంలో భోజనం చేసి సాయంత్రం 4 గంటలకు సోలాపూర్‌కు చేరుకున్నారు. షోలాపూర్‌లోని స్థానిక కార్పొరేటర్ నగేశ్ వల్లియర్ నివాసానికి చేరుకుని పార్టీ నేతలతో కలిసి తేనీటి విందులో పాల్గొన్నారు. సాయంత్రం ఐదు గంటలకు తుల్జాపూర్ భవానీ ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం హైదరాబాద్‌కు తిరుగుపయనమయ్యారు.

విఠల్, రుక్మాయిలను దర్శించుకున్న కేసీఆర్

షోలాపూర్: పార్టీ విస్తరణలో భాగంగా షోలాపూర్ పర్యటనకు వచ్చిన బీఆర్ఎస్ చీఫ్, సీఎం కేసీఆర్ మంగళవారం ఉదయం పండరీపూర్‌లోని విఠల్, రుక్మాయిలను దర్శించుకున్నారు. ఉత్తరద్వారం నుంచి ఆలయంలోకి చేరుకున్న కేసీఆర్‌కు అర్చకులు, నిర్వాహకులు ఘనస్వాగతం పలికారు. విఠలేశ్వరుడి పాద ముద్రికలు, మూల విరాట్ విగ్రహం దర్శనానంతరం కేసీఆర్ రుక్మిణీ అమ్మవారి పాదాలను పసుపు కుంకుమలతో అలంకరించి మొక్కుకున్నారు. అర్చకులు కేసీఆర్ మెడలో తులసిమాలను వేశారు. ప్రత్యేక పూజల్లో పాల్గొని, వేదపండితుల ఆశీర్వాదం తీసుకున్నారు. ఆషాఢ ఏకాదశి పర్వదినానికి రెండు రోజులే ఉండటంతో ఆలయంలో, బయట భక్తుల రద్దీ విపరీతంగా ఉంది. దీంతో కేసీఆర్, కొందరు ప్రజాప్రతినిధులు మినహా ఆయన వెంట వచ్చిన మిగతా వారికి వీఐపీ దర్శనం కల్పించలేదు. దీంతో వారు ఆలయ శిఖర దర్శనం చేసుకుని వెనుదిరిగారు. అదేవిధంగా ముందుగా ప్రకటించిన ప్రకారం వేయి కేజీల గులాబీ పూలను హెలికాప్టర్ ద్వారా కురిపించేందుకు పోలీసులు అనుమతివ్వలేదు. హైదరాబాద్ నుంచి కేసీఆర్ వెంట వచ్చిన 600 వాహనాలను భద్రతా కారణాలతో పోలీసులు పండరీపూర్‌లోకి అనుమతించలేదు. కేసీఆర్ షోలాపూర్ నుంచి పండరీపూర్ ఆలయానికి వస్తున్న క్రమంలో స్థానికులు ఆయనను చూసేందుకు పోటీపడ్డారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు కదిలారు.



సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న తులసిచందు. చిత్రంలో వివిధ సంఘాల నేతలు

ప్రశ్నించే గొంతుకలను అణగదొక్కుతున్నారు

- స్వతంత్ర జర్నలిస్ట్ తులసిచందు ఆవేదన
- 'జర్నలిజం–ట్రోల్ ముఠాలు' అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం
- ట్రోలింగ్ ముఠాలకు తగిన గుణపాఠం చెప్పాలన్న వక్తలు
- తులసీచందుకు జర్నలిస్టులు, ప్రజా సంఘాల మద్దతు

పంజగుట్ట (హైదరాబాద్): ప్రశ్నించే జర్నలిస్టుల గొంతులను కొందరు మతవాదంతో అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారని స్వతంత్ర జర్నలిస్టు తులసిచందు అన్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికల సమయంలో 'మతం వస్తుంది మేలుకో' అని వీడియో చేసినందుకు తనపై యాంటీ హిందూ ముద్ర వేశారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల తాను పెట్టిన కంటెంట్ మీద ఫేస్‌బుక్‌లో ఎటాక్ జరిగిందన్నారు. మంగళవారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్, హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్, హైదరాబాద్ ప్రెస్‌క్లబ్, నెట్‌వర్క్ ఆఫ్ ఉమెన్ ఇన్ మీడియా, తెలంగాణ స్టేట్ స్మాల్ అండ్ మీడియం పేపర్స్, మేగజైన్స్ అసోసియేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో 'జర్నలిజం– ట్రోల్ ముఠాలు' అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విరాహత్ అలీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏపీ ప్రభుత్వ జాతీయ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్, ప్రొఫెసర్ హరగోపాల్, సీనియర్ పాత్రికేయులు కె.రామచంద్రమూర్తి, పాశం యాదగిరి, కె.శ్రీనివాస్, వేణుగోపాల్, ప్రొఫెసర్ పద్మజాషా, సామాజిక కార్యకర్తలు సజయ, పీవోడబ్ల్యూ సంధ్య, రాజకీయ విశ్లేషకులు డాక్టర్ మిత్రలతో పాటు 39 పౌరసంఘాలు పాల్గొని తులసిచందుకు సంఘీభావం తెలిపాయి. తులసిచందు మాట్లాడుతూ, తాను ఏ వార్తను సృష్టించ లేదని, అయినా తనను శత్రువుగా, అర్బన్ నక్సలైట్‌గా చిత్రీకరిస్తున్నారని ఆమె పేర్కొన్నారు. ప్రశ్నించే గొంతుకలపై దాడులు చేస్తున్నవారి వెనక ఎవరు ఉన్నారో ఆరాతీయాల్సిన అవసరం ఉందన్నారు. బీజేపీ నేతలను, ప్రధానిని ప్రశ్నించే వారిపై నేరుగా దాడులు చేసేందుకు ఓ వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారని ఆమె ఆరోపించారు. తనపై దాడి చేస్తున్న మూడు యూట్యూబ్ చానల్స్, ఒక ఫేస్‌బుక్ ఖాతాపై కేసు పెట్టానని వెల్లడించారు. ప్రశ్నించే జర్నలిస్టులపై దాడులు చేస్తే అంతా ఐక్యం కావాల్సిన అవసరం ఉందన్నారు.

దేవులపల్లి అమర్ మాట్లాడుతూ, సోషల్ మీడియా వెలుగులోకి వచ్చాక ఇండిపెండెంట్ జర్నలిజం విస్తృతంగా ప్రాచుర్యం పొందిందని తెలిపారు. గతంలో వార్తాపత్రికలే ఉన్నప్పుడు ఒక సంస్థపైగానీ, వ్యక్తిపైగానీ వ్యతిరేక వార్తలు రాస్తే యాజమాన్యానికి, సంపాదకులకు ఫిర్యాదు చేసేవారని, సోషల్ మీడియా పెరుగుతున్న క్రమంలో ఇండిపెండెంట్ జర్నలిజంలో ఏ సంపాదకుని కట్టడి లేకుండా పోయిందన్నారు. ఇండిపెండెంట్ జర్నలిజం రావడం చాలామందికి ఇష్టం ఉండదని, అదే తులసిపై దాడికి దారితీసిందని అన్నారు. తులసికి తానుపూర్తి సంఘీభావం తెలుపుతున్నట్లు ప్రకటించారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ, సమాజంలో దళిత, మైనార్టీ మహిళలపై దాడులు జరుగుతూనే ఉన్నాయని, ఈ దాడి తులసి మీద కాకుండా యావత్ మహిళలపై దాడిగా భావించాలన్నారు. తులసికి పౌరహక్కుల సంఘాలు, ప్రజా సంఘాలు పూర్తి మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు.

ముగ్గురి ప్రాణం తీసిన ఆన్‌లైన్ జూదం

- ఆన్‌లైన్ పేకాటలో రూ.లక్షలు పోగొట్టుకున్న మహిళ
- అప్పులు ఇచ్చినవారి ఒత్తిడి పెరగడంతో మనస్తాపం
- ఇద్దరు చిన్నారులను చంపేసి, తానూ ఆత్మహత్య

చౌటుప్పల్: ఆన్‌లైన్ పేకాట ముగ్గురి ప్రాణాలు బలిగొంది. ఆటలో డబ్బులు పోవడం, అప్పుల వాళ్ల ఒత్తిడి పెరగడంతో.. తీవ్ర మనోవేదనకు గురైన మహిళ తన ఇద్దరు కుమారులను నీటి సంపులో తోసి హత్య చేసింది. ఆపై తానూ అందులోనే దూకి ప్రాణాలు తీసుకుంది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో జరిగిన ఈ విషాదకర ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. వలిగొండ మండలం గొల్నేపల్లి గ్రామానికి చెందిన అవిశెట్టి నర్సింహ పెద్ద కుమారుడు మల్లేశ్‌కు భూదాన్ పోచంపల్లి మండలం దంతూరు గ్రామానికి చెందిన రాజేశ్వరి(28)తో పదేళ్ల కిందట పెళ్లైంది. వీరికి అనిరుధ్(5), హర్షవర్ధన్(3) కుమారులు. కొంతకాలం చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెంలో ఉండి.. ఏడేళ్ల క్రితం చౌటుప్పల్ పట్టణ కేంద్రానికి వచ్చారు. సాధారణ గృహిణి అయిన రాజేశ్వరి ఇంటర్మీడియట్ వరకు చదువుకుంది. తన వద్దనున్న స్మార్ట్‌ఫోన్‌లో ఆన్‌లైన్ (పేకాట)గేమ్‌కు ఆకర్షితురాలైంది. వేలల్లో పెట్టుబడి పెట్టి పేకాట ఆడి చాలా నగదు పోగొట్టుకుంది. ఇంట్లో తెలియకుండా పలువురి వద్ద అప్పు చేసింది. మొత్తంగా సుమారు రూ.8లక్షల వరకు పోగొట్టుకోవడంతో విషయం ఇంట్లో తెలిసింది. ఆమె భర్త మల్లేశ్ ఇటీవలే కొంత అప్పు తిరిగి చెల్లించాడు. ఇంకొంతమందికి ఇవ్వాల్సి ఉంది. అది తీర్చేందుకు నారాయణపురంలో ఉన్న ప్లాటును విక్రయించాలని ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం మల్లేశ్ ఇంటికి వచ్చిన అప్పు ఇచ్చిన వ్యక్తులు తమ డబ్బు చెల్లించాలని ఒత్తిడి చేశారు. వాళ్లు వెళ్లిపోయాక, మల్లేశ్ సమీపంలోనే ఉన్న బంధువు వద్దకు వెళ్లాడు. కాసేపటి తరువాత వచ్చిన అతనికి ఇంటి ఆవరణలోనే ఉన్న నీటి సంపులో ఇద్దరు కొడుకులు, భార్య విగతజీవులుగా కనిపించారు. ముగ్గురి మృతితో చౌటుప్పల్‌లో విషాదం అలుముకుంది.

జూలై 8న హైదరాబాద్‌లో బీజేపీ సమావేశం

హాజరుకానున్న 11 రాష్ట్రాల అధ్యక్షులు, సంస్థాగత జీఎస్‌లు

సాక్షి, హైదరాబాద్: దక్షిణాది రాష్ట్రాలతోపాటు వాటికి ఆనుకుని ఉన్న 11 రాష్ట్రాల బీజేపీ అధ్యక్షులు, సంస్థాగత ప్రధానకార్యదర్శుల సమావేశం వచ్చేనెల 8న హైదరాబాద్‌లో జరగనుంది. పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, సంస్థాగత ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్ హాజరుకానున్న ఈ భేటీలో వచ్చే ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించనున్నారు. ఈ ఏడాది చివర్లోగా ఐదు రాష్ట్రాల ఎన్నికలతో సహా 2024 ఏప్రిల్‌లో జరగనున్న లోక్‌సభకు సన్నద్ధమయ్యే విషయంపైనా చర్చ జరగనుంది. తెలంగాణతో సహా ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి, గోవా, లక్షద్వీప్, అండమాన్–నికోబార్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌ల నుంచి నేతలు పాల్గొననున్నారు. కొన్ని నెలల క్రితం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో ప్రాథమికంగా చర్చలు జరపగా, అందులో చర్చించిన అంశాలు, సాధించిన లక్ష్యాలను ఈ సమావేశంలో సమీక్షించనున్నారు. ఈ సమావేశం ముగిశాక సాయంత్రం.. ప్రధాని మోదీ లేదా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పాల్గొనేలా బహిరంగసభ నిర్వహించాలనే ఆలోచనలో రాష్ట్ర పార్టీ ఉంది.

బీఆర్ఎస్‌కు ఓటేస్తే.. బీజేపీకి వేసినట్లే!

- సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ధ్వజం
- బీజేపీకి బీఆర్ఎస్ మద్దతిస్తోంది
- మైనారిటీలను కేసీఆర్ మోసం చేశారు
- తెలంగాణలోనూ కర్ణాటక ఫలితమే వస్తుందని ధీమా



చివ్వెంల మండలం బి.చందుపట్ల గ్రామంలో డప్పు వాయిస్తున్న భట్టి విక్రమార్క

చివ్వెంల (సూర్యాపేట): కర్ణాటక ఎన్నికల్లో వచ్చిన ఫలితమే తెలంగాణలోనూ వస్తుందని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. బీఆర్ఎస్‌కు వేసే ప్రతి ఓటు బీజేపీ వేసినట్లేనని దుయ్యబట్టారు. లౌకిక పార్టీ కాంగ్రెస్‌కు ఓటు వేస్తేనే బీజేపీకి వ్యతిరేకంగా వేసినట్లు అవుతుందని చెప్పారు. భట్టి మంగళవారం సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం తిమ్మాపురం, బి.చందుపట్ల గ్రామాల్లో ప్రాదయాత్ర చేశారు. చందుపట్లలో జరిగిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ.. మైనారిటీలకు 12 శాతం రిజర్వేషన్ ఇస్తామని మోసం చేసిన కేసీఆర్‌కు వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. మంత్రి కేటీఆర్ ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రులను కలవడంతోనే బీజేపీ, బీఆర్ఎస్ వేర్వేరు కాదని మరోసారి స్పష్టమైందన్నారు. చట్టసభల్లో బీజేపీ తెచ్చిన అనేక బిల్లులకు బీఆర్ఎస్ ఎంపీలు మద్దతు తెలిపారన్నారు. భారత్ జోడో యాత్రకు భయపడి రాహుల్ గాంధీ అభ్యర్థిత్వాన్ని ప్రధాని మోదీ రద్దు చేయించారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చట్టాలు తెచ్చినా బీఆర్ఎస్ మద్దతు ఇస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అవినీతిపై మాట్లాడుతున్న కేంద్ర ప్రభుత్వ పెద్దలు.. సీఎం కేసీఆర్‌పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే జనాభా దామాషా ప్రకారం నిధులు కేటాయించి, బీసీ సబ్‌ప్లాన్ తెస్తామన్నారు. తెలంగాణలో ప్రజల ఆకాంక్ష నెరవేరలేదని, నియామకాలు లేకపోవడంతోనే యూనివర్సిటీలు నిరుద్యోగులకు కేంద్రాలుగా మారాయని ఎద్దేవా చేశారు. రైతుబంధు మాత్రమే ఇచ్చి రైతులకు అన్ని రకాల సబ్సిడీలు రాష్ట్ర ప్రభుత్వం తొలగించిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షలు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. ఇళ్లులేని వారికి డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేస్తామన్నారు. కాగా, బి.చందుపట్ల గ్రామంలో భట్టి పత్తిచేను దున్నుతున్న రైతు వద్దకు వెళ్లి అరక పట్టి కొద్దిసేపు దుక్కిదున్నారు. గీత కార్మికులతో మాట్లాడి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి పటేల్ రమేష్ రెడ్డి, టీపీసీసీ మహిళా కాంగ్రెస్ చైర్మన్ సునీతారావు పాల్గొన్నారు.

పాపం పండే రోజు దగ్గరలో ఉంది: గద్దర్

చివ్వెంల(సూర్యాపేట): పదేళ్ల పాలనలో పాపం నిండిపోయింది.. ఆ పాపం పండే రోజు దగ్గరకు వచ్చింది.. అని ప్రజాపార్టీ వ్యవస్థాపకుడు గద్దర్ అన్నారు. ఆయన మంగళవారం సూర్యాపేట జిల్లా చివ్వెంల మండల పరిధిలోని బి.చందుపట్ల గ్రామంలో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పాదయాత్రకు మద్దతు తెలిపి మాట్లాడారు. ధరణి పేరుమీద రైతులను, ప్రశ్నపత్రాలను లీక్ చేసి విద్యార్థులను ప్రభుత్వం మింగేసిందని విమర్శించారు. భట్టి విక్రమార్క పాదయాత్ర చారిత్రకమైందన్నారు. ఈ సందర్భంగా ఆయన పలు గీతాలు ఆలపించి.. మహిళలతో కోలాటం ఆడారు.

అధికారంలోకి వస్తే ఉచిత విద్య, వైద్యం

బీఎస్పీ చీఫ్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

కొత్తకోట రూరల్: బీఎస్పీ అధికారంలోకి వస్తే ఉచిత విద్య, వైద్యం అందుబాటులోకి తెస్తామని బీఎస్పీ చీఫ్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. బహుజన రాజ్యాధికార యాత్ర మంగళవారం పామిరెడ్డిపల్లి, బలిజపల్లి, జంగమాయపల్లి గ్రామాల్లో కొనసాగింది. రాత్రి పెద్దమందడిలో బస చేశారు. పామిరెడ్డిపల్లిలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధనిక రాష్ట్రాన్ని కేసీఆర్ ప్రభుత్వం అప్పుల రాష్ట్రంగా తయారుచేశారని, ప్రజాప్రతినిధులు అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రానున్న రోజుల్లో బీఎస్పీకి అండగా నిలిచి అధికార బీఆర్ఎస్‌కు తగిన బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో జిల్లా బీఎస్పీ ఇన్‌చార్జ్ చెన్నరాములు, అధ్యక్షుడు కృష్ణ, అసెంబ్లీ ఇన్‌చార్జ్ గట్టు మన్నెం, ప్రవీణ్, శివకుమార్, బీఎస్పీ కార్యకర్తలు ఉన్నారు.

ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్‌గా మహమూద్



చారకొండ: రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్‌గా రిటైర్డ్ ప్రొఫెసర్ ఎస్‌కే మహమూద్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ వాకాటి కరుణ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రొఫెసర్ మహమూద్ స్వగ్రామం నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలంలోని జూపల్లి గ్రామం. 1960లో సాధారణ కుటుంబంలో జన్మించిన ఆయన స్వగ్రామంలోనే 5వ తరగతి పూర్తి చేసి 6– 10 వరకు తాండ్ర ప్రభుత్వ పాఠశాలలో, ఇంటర్ కల్వకుర్తి ప్రభుత్వ కళాశాల, డిగ్రీ హైదరాబాద్ న్యూ పీజీ కాలేజ్, పీజీ, పీహెచ్‌డీ ఉస్మానియా యూనివర్సిటీలో పూర్తిచేశారు. అనంతరం యూనివర్సిటీలో అసోసియేట్‌గా, ప్రొఫెసర్‌గా పనిచేశారు. ఓయూలో బాటనీ హెచ్‌ఓడీగా, నిజాం కళాశాలలో హెచ్‌ఓడీగా, సైఫాబాద్ కళాశాల ప్రిన్సిపాల్‌గా, రాంరెడ్డి పీజేఆర్ కళాశాల డైరెక్టర్‌గా పనిచేసి 2020లో పదవీ విరమణ పొందారు. తాజాగా ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్‌గా నియమించడం పట్ల కుటుంబ సభ్యులు, స్నేహితులు హర్షం వ్యక్తం చేశారు. ప్రొఫెసర్ మహమూద్, సోదరుడు బీఆర్ఎస్ నాయకుడు బాలేమియా తదితరులు సోమవారం కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ నివాసంలో కలిసి సీఎం కేసీఆర్‌కు, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

సురవరం ప్రతాపరెడ్డి సేవలు ఎనలేనివి



కసిరెడ్డి వెంకట్‌రెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న వీసీ తదితరులు


పీయూ వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: సాహిత్యానికి సురవం ప్రతాపరెడ్డి ఎనలేని సేవలు చేశారని పీయూ వైస్ చాన్స్‌లర్ లక్ష్మీకాంత్‌రాథోడ్ అన్నారు. మంగళవారం తెలంగాణ వైతాళికుడు 'సురవరం ప్రతాపరెడ్డి స్మారకోపన్యాసం–ఆధునిక సాహిత్యంలో పాటల ప్రస్థానం'పై పీయూలో జాతీయస్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ సురవరం సేవలు నేటి యువతకు ఆదర్శంగా నిలిచాయని అన్నారు. స్వాతంత్ర్యానికి పూర్వం ఎలాంటి సాంకేతికత అందుబాటులో లేనినప్పుడే సాహిత్యంపై ఎన్నో రచనలు చేశారని కొనియాడారు. స్వాతంత్ర్యానంతరం మొదటిసారి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం దక్కిన వ్యక్తి అని పేర్కొన్నారు. జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ యువత తాము చదువుతున్న సబ్జెక్టుల్లో పూర్తిగా పట్టు సాధిస్తేనే జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకుంటారన్నారు. సురువం ప్రతాపరెడ్డి చదువులేని కాలంలోనే సాహిత్యం చూపించి నేటికీ చెరగని ముద్ర వేశారన్నారు. ప్రకృతి సమతుల్యతను కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రకృతితో మమేకమై మనిషి కొనసాగినన్ని రోజులు ఎలాంటి ఇబ్బందులు రావన్నారు. అనంతరం ప్రజాకవి, సినీగేయ రచయిత జయరాజు పాటల ప్రాశస్త్యాన్ని విశదీకరించారు. కార్యక్రమంలో వీసీ ఓఎస్‌డీ డి.మధుసూదన్‌రెడ్డి, రిజిస్ట్రార్ గిరిజా మంగతాయారు, పీయూ ఎగ్జామినేషన్స్ రాజ్‌కుమార్, రాజనీతి శాస్త్ర శాఖ అధ్యక్షుడు నాగం కుమారస్వామి, ప్రిన్సిపాల్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్లు, స్థలాలు ఇవ్వాల్సిందే..

వంగూరు: రాష్ట్రంలోని పేదలందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, గృహలక్ష్మి పథకం ద్వారా ప్రతీ లబ్ధిదారునికి రూ.5లక్షలు ఇంటి నిర్మాణానికి అందించాలని ప్రజాసంఘాల పోరాట వేదిక రాష్ట్ర కన్వీనర్ వీరయ్య డిమాండ్ చేశారు. మంగళవారం వంగూరు మండలం డిండిచింతపల్లి గ్రామానికి ప్రజాసంఘాల బస్సుయాత్ర చేరుకుంది. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడారు. రాష్ట్రప్రభుత్వం దళితులకు ఇస్తానన్న 3ఎకరాల భూమి, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, నిరుద్యోగ భృతిలాంటి అనేక పథకాలను తుంగలో తొక్కిందని అన్నారు. డిండిచింతపల్లి గ్రామంలో నిరుపేదల ఇళ్ల స్థలాల కోసం 11 ఎకరాల భూమిని గత ప్రభుత్వంలో కేటాయించిందని, నేటివరకు ఇళ్ల నిర్మాణం చేపట్టలేదని అన్నారు. పేదల సమస్యలపై సర్వే చేశామని, వాటి పరిష్కారానికి ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి సాగర్, రజక వృత్తి సంఘం రాష్ట్ర కార్యదర్శి కాశయ్య, కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి సైదులు, మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి, పలు ప్రజాసంఘాల రాష్ట్రనాయకులు, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీ సోలిపేట రాంచంద్రారెడ్డి కన్నుమూత



బంజారాహిల్స్/దుబ్బాక టౌన్: రాజ్యసభ మాజీ సభ్యుడు సోలిపేట రాంచంద్రారెడ్డి (88) మంగళవారం ఉదయం బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలోని తన నివాసంలో కన్నుమూశారు. గత కొంత కాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మంగళవారం సాయంత్రం ఫిలింనగర్ మహాప్రస్థానంలో ఆయన అంత్యక్రియలు జరిగాయి.

మచ్చలేని వ్యక్తిగా పేరు: సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం చిట్టాపూర్‌కు చెందిన సోలిపేట రాంచంద్రారెడ్డి 1935 మే 17న మాలిపటేల్ గాలిరెడ్డి–సుందరమ్మ దంపతులకు జన్మించారు. స్వగ్రామం చిట్టాపూర్‌లో ప్రాథమిక, సిద్దిపేటలో హైస్కూల్ విద్యాభ్యాసం కొనసాగింది. రాంచంద్రా రెడ్డి తొలితరం కమ్యూనిస్టు నాయకుల స్ఫూర్తితో తెలంగాణ రైతాంగ పోరాటంలో పాల్గొన్నారు. సిటీ కాలేజీలో పట్టభద్రులైన రాంచంద్రారెడ్డి రాజకీయాల్లో పూర్తి కాలం పనిచేశారు. 70 ఏళ్లపాటు రాజకీయాల్లో క్రియాశీలకంగా పనిచేసి మచ్చలేని వ్యక్తిగా పేరొందారు.

సర్పంచ్ నుంచి ఎంపీ వరకు..

చిట్టాపూర్ తొలి సర్పంచ్‌గా రాజకీయ ప్రస్థానం (1955 నుంచి 1964 వరకు) చేపట్టిన రాంచంద్రారెడ్డి 1972 నుంచి 1978 వరకు దొమ్మాట నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా పనిచేశారు. 1996 నుంచి 2002 వరకు టీడీపీ నుంచి రాజ్యసభ సభ్యుడిగా ఎంపికై రాజ్యసభలో టీడీపీ ఫ్లోర్ లీడర్‌గా, రాజ్యసభ అస్యూరెన్స్ కమిటీ చైర్మన్‌గా పనిచేశారు. కమ్యూనిస్టుగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించి కాంగ్రెస్, టీడీపీలో కీలక పదవుల్లో పనిచేశారు. అలాగే దుబ్బాక సమితి అధ్యక్షుడిగా, సిద్దిపేట మార్కెట్ కమిటీ చైర్మన్‌గా, మెదక్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అధ్యక్షుడిగా, భారత్–చైనా మిత్ర మండలికి అధ్యక్షుడిగా, సీఆర్ ఫౌండేషన్, తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్‌లకు ఆయన సేవలు అందించారు. కొంతకాలం లోక్‌సత్తాలోనూ పనిచేశారు. దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ, సీఎంలు చెన్నారెడ్డి, ఎన్టీఆర్, చంద్రబాబు, సీఎం కేసీఆర్‌లతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ప్రముఖ కవి సినారెకు రామచంద్రారెడ్డి వియ్యంకుడు. డాక్టర్ సి.నారాయణరెడ్డి చిన్న కుమార్తెను తన పెద్ద కుమారుడు వెంకటేశ్వరరెడ్డికి చేసుకున్నారు.

సీఎం సంతాపం: సోలిపేట రామచంద్రారెడ్డి మృతిపట్ల ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు సంతాపాన్ని ప్రకటించారు. నాటి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో పాల్గొన్న సోలిపేట జీవితం ఆదర్శవంతమైదని గుర్తుచేశారు.

1,017 అడుగుల నీటి మట్టం

మదనాపురం: రామన్‌పాడు జలశయంలో మంగళవారం పూర్తి నీటి మట్టం 1,021 అడుగులకు 1,017 అడుగుల వరకు నీరు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ, సమాంతర కాల్వకు వచ్చే నీటిని నిలిపివేశారు. రామన్‌పాడు నుంచి ఎన్‌టీఆర్ కాల్వకు నీటి విడుదలను నిలిపివేశారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు.